నకిలీ బెయిల్‌తో విడుదలయ్యాడు..

'చంచల్‌గూడ'లో వెలుగులోకి వచ్చిన వ్యవహారం

ఫోర్జరీ పత్రాలతో విడుదలైన నిందితుడి కోసం వేట

సిటీబ్యూరో: చంచల్‌గూడ జైల్లో నకిలీ బెయిల్ పేపర్ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నకిలీ బెయిల్ పేపర్లతో చంచల్‌గూడ జైల్లో అండర్ ట్రయల్‌లో ఉన్న సుజాత్ అలీ అనే నిందితుడు జైలు నుంచి బయటపడ్డాడు. ఈ వ్యవహారంలో జైలు అధికారులు, సిబ్బంది పాత్ర ఏమైనా ఉందా? అనుమానాలు కలుగుతున్నాయి. దీనిపై పోలీసులు లోతైన దర్యాప్తు జరుపుతున్నారు. విచారణ ఖైదీగా ఉన్న మరో వ్యక్తి సహాయం చేయడంతో సునాయాసంగా సుజాత్ అలీ జైలు నుంచి బయటపడ్డాడు. ఈ వ్యవహారంపై డబీర్‌పురా పోలీసులు కేసు నమోదు చేశారు. సంతోష్‌నగర్‌కు చెందిన మీర్ సుజాత్ అలీఖాన్‌పై నవంబర్ 2న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి, అతడిని అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. అనంతరం అతడిపై మరో కేసు కూడా నమోదైంది. మొదటి కేసులో రాజేంద్రనగర్ కోర్టు నుంచి సుజాత్ అలీఖాన్ బెయిల్ పొందాడు. అయితే మరో కేసు పెండింగ్‌లో ఉండడంతో జైలు నుంచి విడుదల కాలేదు.

బెయిల్ పేపర్లు తయారు చేశారు...

జైల్లో ఉన్న నిందితులకు సంబంధించిన బెయిల్ పత్రాలు రోజువారీగా టప్పాలో వేస్తారు. ఈ బెయిల్ పేపర్లను పరిశీలించి జైలు అధికారులు బెయిల్ పొందిన వారిని బయటకు పంపిస్తుంటారు. బెయిల్ పత్రాలు పరిశీలించే చోట విచారణ ఖైదీగా ఉన్న రాము అనే వ్యక్తి పనిచేస్తున్నాడు. సుజాత్ అలీ జైల్లో ఉండగానే రాముతో పరిచయం చేసుకున్నాడు. ఒక కేసులో బెయిల్ వచ్చి, మరో కేసులో బెయిల్ రాక పోవడంతో తనను బయటకు పంపిస్తే డబ్బిస్తానంటూ మాట్లాడుకున్నాడు. ఇందులో భాగంగానే గతంలో పొందిన బెయిల్ పేపర్లో తేదీలను మార్చేసి, సంతకాలు ఫోర్జరీ చేసి కొత్తగా నకిలీ బెయిల్ పత్రాలను తయారు చేశారు. అవి టప్పాలో వేశారు. వాటిని పరిశీలించిన రాము అంతా బాగున్నాయని సుజాత్‌కు బెయిల్ వచ్చిందంటూ అధికారులకు చెప్పడంతో అతడిని రిలీజ్ చేశారు. అయితే సుజాత్‌పై ఉన్న మరో కేసుపై విచారణ చేసేందుకు పీటీ వారెంట్‌తో పోలీసులు అక్కడకు వచ్చి జైలు అధికారులను అడుగగా అతడు బెయిల్‌పై విడుదల య్యాడంటూ.. అధికారులు చెప్పారు. దీంతో అతనికి బెయిల్ రాలేదంటూ చెప్పడంతో జైలు అధికారులు అతడిచ్చిన బెయిల్ పత్రాన్ని, ఆన్‌లైన్‌లో తనిఖీ చేసి పక్కా ప్లాన్‌తో సుజాత్ మోసం చేశాడని గుర్తించి డబీర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కొండాపూర్‌లో డ్రగ్స్ పట్టివేత

శేరిలింగంపల్లి, నవంబర్ 1: కొండాపూర్‌లోని ఓ హోటల్ రూంలో ఎండీఎంఏ డ్రగ్స్‌ను సైబరాబాద్ ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు డ్రగ్స్ పెడ్లర్లతో పాటు మరో ఇద్దరు వినియోగదారులను అరెస్టుచేసి.. వారి వద్ద నుంచి రూ.4,18, 600 విలువచేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాదాపూర్ డీసీపీ వినీత్ కేసు వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం మద్దెలపాలెంకు చెందిన గులిపాళ్లి గంగాధర్ స్టాక్ మార్కెటింగ్ చేస్తుంటాడు. ఒడిశాకు చెందిన డాన్స్‌మాస్టర్ కన్హా మహంతి నగరానికి వచ్చి పటేల్ నగర్, మూసాపేట్‌లో నివసిస్తున్నాడు. వారిద్దరు స్నేహితులు. వారు బెంగళూర్ నుంచి నగరానికి ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం కొండాపూర్‌లోని కన్హా బోటిక్ హోటల్ 303 నంబర్ గదిలో గంగాధర్, కన్హ మహంతితో పాటు గంజాయిని కొనుగోలు చేసేందుకు మాదాపూర్‌లోని ఓ హాస్టల్‌లో నివసించే ఇద్దరు యువతులు వచ్చారు. దీనిపై సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 18 గ్రాములు ఎండీఎంఏ, 1 గ్రాము ఓజీ కుష్, 7 గ్రాములు ఇండియన్ చెర్రాస్, 1 ఎల్ఎస్‌డీ పేపర్ డ్రగ్స్‌తో పాటు 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

చదివింది పదోతరగతి.. మోసాలు కోట్లలో..

తృతీయ జ్యువెలరీ అధినేత కాంతిదత్‌కు రిమాండ్

అతడి మీద హిట్ అండ్ రన్‌తో సహా పలు కేసులు

నిందితుడు కాంతిదత్ తోనంగి

బంజారాహిల్స్, డిసెంబర్ 1: చదివింది పదోతరగతి.. ఆకట్టుకునే రూపం.. అనర్గళంగా ఇంగ్లీష్‌లో మాటలు.. ఇంటర్నేషనల్ బిజినెస్ అంశాలపై అవగాహన.. వీటినే పెట్టుబడిగా పెట్టి టాలీవుడ్ నుంచి బాలీవుడ్ దాకా అనేక మంది సెలబ్రిటీలను మోసం చేసి.. ఫోర్జరీ కేసులో అడ్డంగా దొరికిపోయిన తృతీయ జ్యువెలరీ సంస్థ అధినేత కాంతిదత్ తోనంగిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం కోర్టులో హాజరుపర్చగా 14రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతూ మధ్యలోనే ఆపేసిన కాంతిదత్ తోనంగి(24) కుటుంబ సభ్యులతో కలిసి నగరానికి వచ్చాడు. వచ్చినప్పటినుంచే తనకున్న ఆంగ్లభాషా ప్రావీణ్యాన్ని ఉపయోగించుకుంటూ బిజినెస్ మ్యాగజైన్లతోపాటు వ్యాపార సంబంధమైన అంశాలపై ఆసక్తిని పెంచుకున్నాడు. 17ఏండ్ల వయస్సులోనే స్టార్టప్ మీడియా పేరుతో ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థను ఏర్పాటు చేసి.. 2019లో శిల్పకళావేదికలో ఓ భారీ కార్యక్రమాన్ని నిర్వహించాడు. ఆ ఈవెంట్‌లో శిల్పారెడ్డి అనే ప్రముఖ డిజైనర్‌తో పరిచయం పెంచుకుని ఏడాదిన్నర క్రితం బంజారాహిల్స్ రోడ్ నం. 12, ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో సస్టెయిన్ కార్ట్ అనే ఈ కామర్స్ ప్లాట్‌ఫారమ్ ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో అనేకమంది సెలబ్రిటీలతో పరిచయాలు ఏర్పరుచుకుని.. వారికి షేర్లు ఇస్తామంటూ మోసాలు చేయడం ప్రారంభించాడు. ఇదే క్రమంలో నగరానికి చెందిన తిప్పాల శ్రీజ అనే మహిళా వ్యాపారవేత్తతో పరిచయం పెంచుకుని, ఆమెతో కలిసి జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లో తృతీయ జ్యువెలర్స్ సంస్థను ప్రారంభించాడు. రూ.2.50కోట్లు తీసుకుని మోసం చేయడంతో పాటు ఆమె సంతకాలను ఫోర్జరీ చేసి ఆమెను డైరెక్టర్‌గా తొలగించాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు కాంతిదత్‌ను అరెస్ట్ చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. కాగా.. అరెస్టయిన కాంతిదత్ గతంలో తృతీయ జ్యువెలర్స్‌లో పెట్టుబడి పేరుతో ఖతార్‌కు చెందిన ఎన్ఆర్ఐ వ్యాపారవేత్త ప్రవీణ్‌కుమార్‌ను రూ.6కోట్లు మోసం చేయడంతో నవంబర్ 15న సీసీఎస్‌లో చీటింగ్ కేసు నమోదయినట్లు విచారణలో తేలింది. దీంతోపాటు కాంతిదత్ మీద మాదాపూర్ పీఎస్‌లో హిట్ అండ్ రన్ కేసు సైతం నమోదయిందని తెలిసింది. జూలై 14న కొండాపూర్ నుంచి హైటెక్ సిటీవైపు వస్తున్న బంజారాహిల్స్‌కు చెందిన రాపిడో బైక్ డ్రైవర్ రాజశేఖర్‌ను తన బెంజ్‌కారుతో డీకొట్టడంతో రెండ్రోజుల తర్వాత చికిత్స పొందుతూ అతను మృతిచెందినట్లు తేలింది. యాక్సిడెంట్ తర్వాత కనీసం కారు ఆపకుండా వెళ్లిపోవడంతో ఓ యువకుడు వీడియో తీసి నెలరోజుల తర్వాత మృతుడి కుటుంబ సభ్యులకు పంపించడంతో ఈ వ్యవహారంపై కేసు నమోదయినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో పాటు జూబ్లీహిల్స్ రోడ్ నం .25లోని నయోమీ రెస్టారెంట్ వ్యవహారంలో కూడా కాంతిదత్ మీద ఫోర్జరీ కేసు నమోదయినట్లు విచారణలో వెల్లడయింది. కాంతిదత్ బాధితుల్లో హీరోయిన్ కాజల్ అగర్వాల్, కీర్తిసురేశ్, డిజైనర్ శిల్పారెడ్డి , తదితరులు ఉన్నారని వెల్లడయింది.

ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): నేడు యూసుఫ్‌గూడలోని పోలీస్ బెటాలియన్ పోలీస్ లైన్ గ్రౌండ్‌లో పుష్ప-2 సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ నేపథ్యంలో సోమవారం సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు కేవీబీఆర్ స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తెలిపారు.

- జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం(కేవీబీఆర్) వైపు వెళ్లే వాహనాలను కృష్ణానగర్ జంక్షన్ వద్ద శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట వైపు మళ్లిస్తారు.
- మైత్రివనం జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్, మాదాపూర్ వైపు వెళ్లే వాహనాలను యూసుఫ్‌గూడ బస్తీ వద్ద మళ్లిస్తారు. ఈ వాహనాలు ఆర్‌బీఐ క్వార్టర్స్ కృష్ణానగర్ జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు చేరుకోవాలి.
- మైత్రివనం నుంచి బోరబండ బస్‌స్టాప్ వైపు వెళ్లే వాహనాలను సవేరా ఫంక్షన్ హాల్ వద్ద మళ్లిస్తారు. ఈ వాహనాలు కృష్ణానగర్ పార్క్, జీటీఎస్ టెంపుల్, కళ్యాన్‌నగర్, మోతీనగర్ బస్‌స్టాప్ వైపు వెళ్లాలి.
- బోరబండ బస్‌స్టాప్ నుంచి మైత్రివనం జంక్షన్ వైపు వెళ్లే వాహనాలను ప్రైమ్ గార్డెన్ వద్ద మళ్లిస్తారు. ఈ వాహనాలు కళ్యాణ్‌నగర్, మిదాలండ్ బేకరీ, జీటీఎస్ కాలనీ, ఉమేశ్ చంద్ర విగ్రహం నుంచి మైత్రీవనం వైపు వెళ్లాలి.
- జానకమ్మ తోట, సవేరా ఫంక్షన్, మహమూద్ ఫంక్షన్ హాల్‌లో నాలుగు చక్రాల వాహనాలను పార్కు చేయాలి.

టగ్ ఆఫ్ వార్ టెక్నికల్ కమిటీ బోర్డు చైర్మన్‌గా అయూబ్ ఖాన్

టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ టెక్నికల్ కమిటీ బోర్డు చైర్మన్‌గా యూసుఫ్‌గూడకు చెందిన అయూబ్ ఖాన్ నియమితులయ్యారు. ఆదివారం నగరంలోని ఎల్‌బీ స్టేడియం ఫతే మైదాన్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో టగ్ ఆఫ్ వార్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధవి పాటిల్, సెక్రటరీ జనరల్ మదన్ మోహన్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ పవన్‌లు ఈ మేరకు ప్రకటించారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూఏ తెలంగాణ అధ్యక్షుడు ఎ.మహేశ్.. అయూబ్ ఖాన్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టగ్ ఆఫ్ వార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, ట్రెజరర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు. **– జూబ్లీహిల్స్, డిసెంబర్1**

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

షియా శరన్‌రాయ్ (ఫైల్)

కీసర, డిసెంబర్ 1: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందా డు. కీసర సీఐ వెంకటయ్య కథనం ప్రకారం.. నాగారం మున్సిపల్ పరిధిలోని సుర్వీ బాబయ్య ఫంక్షన్ హాల్ వద్ద షియా శరన్‌రాయ్ (37) అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వా హనం అతడిని ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేర కు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ఆటో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, టీపడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, టీయూసీఐ నాయకుడు లింగం గౌడ్, తదితరులు

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య

చర్లపల్లి, డిసెంబర్ 1 : వచ్చే అసెంబ్లీ సమావేశంలో ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య కోరారు. కాప్రా సర్కిల్ హెచ్ఎంటీ నగర్, నాచారంలోని బీఆర్‌టీయూ గ్రేటర్ కార్యాలయంలో ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా ఆటో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆటో బంద్‌కు సంబంధించి గోడ పత్రికను టీపడీఎస్ రాష్ట్ర కార్యదర్శి సత్తిరెడ్డి, టీయూసీఐ గ్రేటర్ గౌరవ అధ్యక్షుడు లింగం గౌడ్, శాతం రమేశ్, హైమ్మద్‌లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. వచ్చే అసెంబ్లీ సమావేశంలో ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. డిసెంబర్ 7న నిర్వహించనున్న ఆటో బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జేఏసీ నాయకులు అక్కి రామాంజనేయులు, తిరుమల్, కిషన్, శ్రీరాం, సాయి, మున్నా యాదవ్, కుమార్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ పట్టివేత

జవహర్‌నగర్, డిసెంబర్ 1: కలుషిత అల్లం వెల్లుల్లి తయారు చేస్తున్న ఓ ఇంటిపై మల్కాజిగిరి ఎస్ఓటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి.. కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జవహర్‌నగర పోలీస్‌స్టేషన్ పరిధి లో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో రహస్యంగా కలుషిత పదార్థాలతో అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆ ఇంటిపై దాడిచేశారు. యజమాని మహ్మద్ అతావుల్లాను అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి సుమారు 1000కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీయురాలి వ్యభిచార దందా..

టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి - ముగ్గురు అరెస్ట్

సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో విదేశస్థురాలు వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తూ నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడింది. లోకంటో యాప్‌ను అడ్డాగా చేసుకొని తన దేశస్థురాలినే సబ్ ఆర్గనైజర్‌గా పెట్టి ఈ దందాను నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుదీంద్ర కథనం ప్రకారం.. ఉగాండకు చెందిన నయీబేర్ డొరీన్ హైదరాబాద్‌కు వచ్చి తర్వాత లోని నాగార్జుననగర్‌లో ఒక ఇంటిని అద్దెకు తీసుకుంది. తమ దేశానికి చెందిన కుమాంఘి రిత్షను సబ్ ఆర్గనైజర్‌గా పెట్టుకుని దందా నడిస్తున్నది. లోకంటో యాప్‌లో సెల్‌నంబర్‌ను అప్‌లోడ్ చేసి.. విటులు ఆ నంబర్‌తో చాటింగ్ చేయడంతో లొకేషన్ ముందుగా సికింద్రాబాద్ అంటూ షేర్ చేస్తారు. కస్టమర్ సికింద్రాబాద్ వచ్చిన తరువాత బ్రోతల్ హౌస్ లొకేషన్‌ను షేర్ చేస్తారు. ఎవరికి అనుమానం రాకుండా ఇద్దరే అక్కడ ఉంటూ ఒకసారి స్టడీ వీసాపై వచ్చామని, మరోసారి బిజినెస్ వీసాపై వచ్చామని స్థానికులు ఎవరైనా అడిగినప్పుడు చెబుతుంటారు. లోకంటో అడ్డగా నగరంలో వ్యభిచారం జరుగుతుందని సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.సైదులు బృందం ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుల సహకారంతో బ్రోతల్ హౌస్‌పై దాడి చేసి నిర్వాహకురాలు, సబ్ నిర్వాహకురాలితో పాటు విటుడు ఉప్పల్‌కు చెందిన పొట్టూరి అంజన్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు.

కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

ముదిరాజ్ సంఘం జిల్లా మహాసభ అధ్యక్షుడు మల్లేశ్‌ముదిరాజ్

కానిస్టేబుల్ కిష్టయ్యకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 1 : తెలంగాణ ఉద్యమంలో కానిస్టేబుల్ కిష్టయ్య పాత్ర వెలకట్టలేనిదని ముదిరాజ్ సంఘం జిల్లా మహాసభ అధ్యక్షుడు భైరమోని మల్లేశ్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో సెల్‌టవర్ ఎక్కి ఆత్మబలిదానం చేసుకొని అమరుడైన కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి సంస్మరణ సభను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మల్లేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కానిస్టేబుల్ కిష్టయ్య పాత్ర వెలకట్టలేనిదని గుర్తు చేశారు. కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మెరుగు సురేశ్ ముదిరాజ్, టౌన్ అధ్యక్షుడు మనోజ్‌ముదిరాజ్, బొబ్బిలి కిష్టయ్య, జిల్ల శ్రీనివాస్, సిద్దేశ్వర్‌ముదిరాజ్, మహేందర్‌ముదిరాజ్, జిల్ల ఆనంద్, బొబ్బి లి శేఖర్, రాములు ముదిరాజ్, సిద్దు, హన్మంతు, నాగం గిరి, మల్లేశ్, కృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

వాన.. హైరానా

ఆదివారం మధ్యాహ్నం నుంచి కురిసిన చిరుజల్లులు సాయంత్రానికి ఎక్కువ కావడంతో నగర ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై నీళ్లు నిలువడంతో వాహనదారులు ఆందోళన చెందారు. దీంతో ట్రా ఫిక్ జామ్ కావడంతో నరకయాతన అనుభవించారు.

క్రెడిట్‌కార్డు సర్వీస్ చార్జీలను తగిస్తామంటూ మోసం

మన్సూరాబాద్, డిసెంబర్ 1: క్రెడిట్ కార్డుకు అధికంగా వస్తున్న సర్వీస్ చార్జీలను తగ్గిస్తామంటూ ఓ వ్యక్తిని నమ్మించి ఆన్‌లైన్‌లో డబ్బులు కాజేశారు. ఈ సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్బీనగర్, రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన వేణుగోపాల సాయి ఓ హోటల్‌లో రిసెప్షనిస్ట్. వేణుగోపాల్ సాయికి శనివారం మధ్యాహ్నం 12:35 గంటల సమయంలో సెల్: 8618145547 నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి.. మీరు ఉపయోగిస్తున్న ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుకు ఇంటర్నేషనల్ ట్రాన్సాక్షన్ సర్వీస్ ఉండటం వల్ల అధికంగా సర్వీస్ చార్జీలు వస్తున్నాయని.. మీ వద్ద ఉన్న ఎస్‌బీఐ యాప్ నుంచి ట్రాన్సాక్షన్ సర్వీస్‌ను రద్దు చేసుకోవాలని సూచించాడు. అయితే.. సదరు యాప్‌లో సర్వీస్‌ను రద్దు చేసే సౌకర్యం లేదని తెలుపగా.. వాట్సప్‌కు ఓ యాప్‌ను పంపించగా దానిని తన సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. కొద్ది సేపటికి తన ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకుల నుంచి రూ. 1, 33, 650లను ఇతర అకౌంట్‌లకు ట్రాన్స్‌ఫర్ అయినట్లు గుర్తించి నేషనల్ హెల్ప్‌లైన్ నంబర్. 1930కి ఫిర్యాదు చేశాడు. అనంతరం బాధితుడు ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఒడిశా నుంచి నగరానికి గంజాయి రవాణా..

- ముగ్గురు అరెస్టు.. పరారీలో మరొకరు.. రూ.18లక్షల విలువైన 57 కిలోలు స్వాధీనం

గచ్చిబౌలిలోని కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ వినీత్, చిత్రంలో ఏడీసీపీ జయరాం రెడ్డి, ఎసీపీలు నర్సింహారావు, శ్రీకాంత్‌లు

శేరిలింగంపల్లి, నవంబర్ 1: ఒడిశా నుంచి నగరానికి గంజాయి తరలిస్తున్న ముగ్గురిని చందానగర్ పోలీసులు అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నాడు. వారి నుంచి 57 కిలోల గంజాయితోపాటు మహింద్రా ఎక్స్‌యూవీ కారు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాదాపూర్ డీసీపీ వినీత్ కేసు వివరాలు వెల్లడించారు. హర్యాన రాష్ట్రం, దివానీ జిల్లాకు చెందిన చమన్, రాకేశ్, నగరంలోని బోయిన్‌పల్లికి చెందిన శివంపేట ఉమాకాంత్ అలియాస్ చిన్ను, అర్జున సాయికృష్ణలు ముఠాగా ఏర్పడి గంజాయి రవాణాకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో కారులో గంజాయిని ఒడిశా నుంచి నగరానికి తీసుకువస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్ ఓటీ, చందానగర్ పోలీసులు శనివారం రాత్రి గంగారం హనుమాన్ దేవాలయం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. మహీంద్రా ఎక్స్‌యువీ 300 (టీఎస్225068) కారు రాగా దానిని ఆపి తనిఖీ ని ర్వహించగా.. కారు డోర్లలో ఉన్న రూ.18 లక్షల విలువచేసే 57 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీ నం చేసుకున్నారు. కారులో ఉన్న చమన్, ఉమాకాంత్‌తో పాటు ద్విచక్రవాహనంపై పైలట్‌గా వస్తున్న సాయి కృష్ణలను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడి హర్యానకు చెందిన రాకేశ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 57 కిలోల గంజాయితోపాటు కారు, పల్సర్ బైక్ (టీజీ10 ఏటీఆర్ 8636), మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో మాదాపూర్ ఏడీసీపీ జయరాం రెడ్డి, మియాపూర్, మాదాపూర్ ఎసీపీలు నర్సింహారావు, శ్రీకాంత్, చందానగర్ సీఐ పాలవెల్లి పాల్గొన్నారు.

పలు చోట్ల ఆబ్కారీ రూట్‌వాచ్

పోలీసుల తనిఖీలు గమనించి పరారైన నిందితుడు

20.19 గంజాయి సహా కారు సీజ్

సిటీబ్యూరో, డిసెంబరు 1 (నమస్తే తెలంగాణ): అక్రమంగా గంజాయి రవాణా జరుగుతున్నట్లు తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా ఆబ్కారీ పోలీసులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రూట్‌వాచ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న వ్యక్తి ఆబ్కారీ పోలీసులను గమనించి కారును వదిలి పరార్యా డు. శంషాబాద్ డీటీఎఫ్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం ...ఒడిశా మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన బిక్రం హీరా ఒడిశా నుంచి గంజాయిని నగరానికి రవాణా చేస్తుంటాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి కారులో గంజాయి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం అందుకున్న శంషాబాద్, సరూర్‌నగర్ డీటీఎఫ్ పోలీసులు శేరిలింగంపల్లి ఆబ్కారీ పోలీసులతో కలిసి గచ్చిబౌలి, రాయదుర్గం-నానక్‌రామ్‌గూడ రోడ్, ఖాజాగూడ సర్కిల్, మీనాక్షి అపార్ట్‌మెంట్స్, తదితర ప్రాంతాల్లో రూట్ వాచ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు. ఆబ్కారీ పోలీసుల తనిఖీలను గమనించి బిక్రం హీరా ఖాజాగూడ సర్కిల్ వద్ద గంజాయి రవాణా చేస్తున్న కారును వదిలి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు ఆబ్కారీ పోలీసులు కారులో ఉన్న 20.19కిలోల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్, శంషాబాద్ ఈఎస్ కృష్ణప్రియ ఆదేశాల మేరకు జరిపిన ఈ తనిఖీల్లో శంషాబాద్ డీటీఎఫ్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సరూర్‌నగర్ డీటీఎఫ్ ఎస్ఐ శంకర్, శేరిలింగంపల్లి ఎస్ఐ మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్.. 172 మంది పట్టివేత

సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు శనివారం రోజు నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 172 మంది మందుబాబులు పట్టుబడ్డారు. 172 వాహనాలను సీజ్ చేశారు. పట్టు బడిన వారిలో 18 మందికి బీఏసీ రేంజ్ 200ఎంజీ/100 ఎంఎల్, 550 ఎంజీ/100ఎం ఎల్ ఉన్నట్లు తేలింది. పట్టుబడిన మందుబాబులను న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PEST CONTROL

★చెదలు, బ